క్లుప్తంగా

విద్యార్థులకు వేసవి శిక్షణ



ఫిరంగిపురం: స్థానిక గాలిబాలి శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణలో భాగంగా మంగళవారం హౌస్‌గణేషుని పాడు వద్దనున్న కొండవీటి రెడ్డిరాజుల మ్యూజియం చూపించారు. గ్రంథాలయాధికారి సత్యశిరీష మాట్లాడుతూ వేసవి శిక్షణలో భాగంగా విద్యార్థులకు మనోవికాసానికి ఇటువంటివి ఎంతో దోహదపడతాయని చెప్పారు. మ్యూజియంలో కొండవీటి రెడ్డిరాజుల కాలంనాటి వస్తువులు, కత్తులు, డాలు, మంచాలు, వారు వాడిన నాణేలు, కోట బురుజుల చిత్రాలు చూపించారు. చరిత్రను వివరించారు. కార్యక్రమంలో పి.జేమ్స్, ఫ్రాన్సిస్, సుందరం, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైభవంగా చతుర్థ కలశ స్థాపన

ఫిరంగిపురం: మండలంలోని హౌస్‌గణేశుని పాడు గ్రామంలోని కొండపై గణేశవిగ్రహ ప్రతిష్ఠ రెండోరోజు చతుర్థశ కలశస్థాపన పూజలు మంగళవారం వేదపండితులు వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే వేదపండితులు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన యాగశాల వద్ద ఉక్త హోమాలు, పంచగవ్యాధివాసం, క్షీరాధివాసం, జలాధివాసం, అధివాస హోమాలు నిర్వహించి విశేష నివేదన కావించారు. సాయంత్రం శ్రీలక్ష్మీ గణపతి హోమం, మహాశాంతి హోమం, హౌత ప్రశంశ, విగ్రహానికి శయ్యాధివాసం, గోష్టి నిర్వహించి ఆశీర్వచనం అందజేశారు. కార్యక్రమాలను వేదపండితులు నారాయణం ప్రసాదాచార్యులు, వంశీకృష్ణలు పర్యవేక్షిస్తున్నారు.

సమాజ సేవలో ది విశాఖ పట్టణం కో ఆపరేటివ్ బ్యాంక్

మంగళగిరి: లాభాల కోసం కాకుండా సమాజం కోసం, సామాన్య ప్రజల కోసం ఏర్పాటు చేసిన బ్యాంకు ది విశాఖపట్టణం కో ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ అని చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు అన్నారు. నగరంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో మంగళగిరి బ్రాంచి సభ్యుల మహాసభ మంగళవారం జరిగింది. చైర్మన్ మాట్లాడుతూ సామాన్య ప్రజలకు సైతం బ్యాంకు సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో సభ్యులే బ్యాంకుకు యజమానులుగా ఉన్నారన్నారు. బ్యాంకు స్థాపించి 107 సంవత్సరాలు పూర్తి చేసుకుని రూ.500 కోట్ల సొంత నిధులతో, 14 సొంత భవనాలతో కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో విజయవాడ జోనల్ మేనేజర్ సీహెచ్‌వీఆర్ సుబ్రమణ్యం, మంగళగిరి బ్రాంచి మేనేజర్ కేవీవీ ఫణి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డెంగీని అరికట్టడానికి అప్రమత్తత తప్పనిసరి

తాడికొండ: డెంగీ వ్యాధిని అరికట్టేందుకు అప్రమత్తత అవసరమని తుళ్లూరు మండలం వైద్యాధికారి డాక్టర్ కె.తిరుమలదేవి అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవం పురస్కరించుకుని పొన్నెకల్లు పీహెచ్‌సీలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆమె పాల్గొని ప్రసంగించారు. జనావాసాలు పెరిగే ప్రాంతాల్లో అపరిశుభ్ర వాతావరణం, కొబ్బరి చిప్పలు, మురుగు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పగలు కుట్టే డెంగీ దోమ ద్వారా కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మరో వైద్య అధికారి డాక్టర్ సాయికృష్ణ భార్గవ్, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి సంగం డెయిరీ చేయూత

మేడికొండూరు: మండల పరిధిలోని భీమినేని వారిపాలెం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో పాడి మహిళ రైతు ముప్పాళ్ల శివకుమారి మృతి చెందింది. విషయం తెలుసుకున్న సంగం డెయిరీ రెంటపాళ్ల బీఎంసీ మేనేజర్ గోపి, సూపర్‌వైజర్ నవీన్‌లు డీపీసీ అభయం స్కీమ్ కింద రూ.60వేలు నగదును మృతురాలి కుమారుడు రాజేంద్రప్రసాద్‌కు మంగళవారం పాల ఉత్పత్తిదారుల సహకారం సంఘం కార్యాలయంలో అందజేశారు. గోపి మాట్లాడుతూ పాల ఉత్పత్తిదారుల సంక్షేమమే సంగం డెయిరీ లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. గ్రామ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు, సొసైటీ సెక్రటరీ కోటేశ్వరరావు, కె.శివయ్య, పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

వృద్ధులకు నిత్యావసరాల కిట్లు అందజేత



నెహ్రూనగర్: ఇంటర్నేషనల్ యంగ్ మెన్స్ క్రిస్టియన్ అసోసియేషన్ గుంటూరు ఆధ్వర్యంలో ఏటుకూరులో రోడ్డులోని మమ్మీ డాడీ ఓల్డేజ్ హోమ్‌లో వృద్ధులకు అవసరమైన నిత్యావసరాలు కిట్లను అసోసియేషన్ నాయకులు మంగళవారం అందజేశారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ బిషప్ ఏజేసీ శోభన్‌బాబు మాట్లాడుతూ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అవసరమైన కిట్లు అందజేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్‌లో కూడా ఇలాంటి సేవ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ పీజే శామ్యూల్, ట్రెజరర్ ప్రకాష్ పాల్గొన్నారు.

ప్రతి పేద కుటుంబం సొంతింటి కల నెరవేరుస్తాం

ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)



కృష్ణాయపాలెంలో ఇంటి పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)

తాడేపల్లిరూరల్: సొంతిల్లు లేని ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల నెరవేర్చడమే వైఎస్సార్‌సీపీ లక్ష్యమని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆ దిశగా పనిచేస్తున్నారని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు లేని అక్కాచెల్లెమ్మలకు సీఆర్‌డీఏ పరిధిలోని కృష్ణాయపాలెం లే అవుట్‌లో ఆయన ఇళ్లపట్టాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ 99 శాతం ఇల్లులేని పేద అక్కాచెల్లెమ్మలు అందరికీ ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు అందజేశామని, పొరపాటున ఎవరికైనా రాకపోతే వారు మరల దరఖాస్తు చేసుకుంటే 90 రోజుల్లో వారికి ఇంటిపట్టాలు ఇస్తామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ బుర్రముక్కు వేణుగోపాలస్వామి రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్‌రాజు, డాక్టర్ వైఎస్సార్, కేవీఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు కళ్లం రాజశేఖర్‌రెడ్డి, మేకా వెంకటరామిరెడ్డి, జక్కిరెడ్డి కృష్ణారెడ్డి, కిషోర్, పండు తదితరులు పాల్గొన్నారు.



ఎన్నోసార్లు దరఖాస్తు చేసుకున్నా..

గత ప్రభుత్వంలో జన్మభూమి కార్యక్రమం జరిగిన ప్రతిసారీ అధికారులకు ఇల్లు కావాలని దరఖాస్తు చేసుకున్నా రాలేదు. జగనన్న ప్రభుత్వంలో అడగకుండానే వలంటీర్లు ఇంటికి వచ్చి ఇంటిస్థలం వచ్చింది, పట్టాలు ఇస్తున్నాం వచ్చి తీసుకోండని తెలియజేశారు. మాకు కూడా సొంత ఇంటి కల నెరవేరింది.

– మోతుమల్లి రాజ్యలక్ష్మి, క్రిస్టియన్‌పేట



సంపాదనలో సగం ఇంటి అద్దెకే..

భార్యాభర్తలం కష్టపడ్డా కుటుంబ ఖర్చులకు చాలడం లేదు. సంపాదించిన డబ్బుల్లో సగం ఇంటి అద్దెకే పోతుంది. పెళ్లయిన దగ్గర నుంచి రెండు గదుల ఇంట్లో అద్దెకు ఉంటున్నాం. కృష్ణాయపాలెంలో మాకు ఇచ్చిన ఈ సెంటు స్థలం మా కుటుంబానికి సరిపోతుంది. సొంత ఇల్లు కట్టుకుంటే ఎంతో కొంత డబ్బులు వెనకేసుకోవచ్చు.

– జెట్టి రత్నకుమారి, క్రిస్టియన్‌పేట

చిరువ్యాపారులకు తోపుడు బండ్లు అందజేత



చిరు వ్యాపారులకు తోపుడు బండ్లను అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని కొలనుకొండలో చిరు వ్యాపారం చేసుకుంటున్న ఇద్దరికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) సహకారంతో మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ కన్వీనర్ నూతక్కి శ్రీనివాసరావు తోపుడు బండ్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ కొలనుకొండలో షేక్ సుభాని, అన్నమ్మలు అద్దె బండ్లపై చిరు వ్యాపారం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారని, అద్దెలు చెల్లించకలేకపోతున్నామని తెలుపగా ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) స్పందించి తోపుడు బండ్లను తయారు చేయించి వారికి అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జాన్ శ్రీను, గొడ్డిపాటి వెంకటేశ్వరరావు (జీవీఆర్), తెన్నులూరి రమణ, బాణావత్ వెంకటేశ్వరరావు, షేక్ బాషా, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రమాద మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

ఏపీ రైతు సంఘం కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

తాడేపల్లిరూరల్: ఒడిశాలో జరిగిన రైలు ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం నగర పాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరం వద్ద జాతీయ రహదారివద్ద ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఒడిశాలో కోరమండల్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాద ఘటన దురదృష్టకరమని, ఈ దుర్ఘటనకు బాధ్యత వహిస్తూ రైల్వేశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనలో చనిపోయిన మృతుల కుటుంబాలకు రూ.30 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుమారు 238 మందికిపైగా ఈ దుర్ఘటనలో మృతి చెందడం ఆవేదన కలిగిస్తోందని అన్నారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు మాట్లాడుతూ సిగ్నల్ వ్యవస్థను కూడా ప్రైవేటుపరం చేయడం వలన రైలు ప్రమాదం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణ, సీనియర్ నాయకులు వై.కేశవరావు, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్నా శివశంకరరావు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె. ధనలక్ష్మి, ఏపీ రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, కాట్రగడ్డ శివన్నారాయణ, అమ్మిశెట్టి రంగారావు, కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అప్పలరాజు, కారసాల స్వాతి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

కమిషనర్‌కు వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు దొంతిరెడ్డి వినతి



కమిషనర్ శారదాదేవికి వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షులు దొంతిరెడ్డి

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ శారదాదేవిని మంగళవారం వైఎస్సార్‌సీపీ మంగళగిరి తాడేపల్లి నగర పార్టీ అధ్యక్షులు దొంతిరెడ్డి వేమారెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ తాడేపల్లి పట్టణ పరిధిలోని మహానాడు, కృష్ణనగర్ ప్రాంతాల్లో తాగునీటి సమస్య అధికంగా ఉందని, తాగునీటి సమస్యను పరిష్కరించాలని, బకింగ్‌హామ్ కెనాల్ బ్రిడ్జిపై ట్రాఫిక్ అధికంగా ఉన్న కారణంగా ప్రత్యామ్నాయ బ్రిడ్జి నిర్మించాలని, తాడేపల్లి హిందూ శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలని కమిషనర్ శారదాదేవికి వినతిపత్రం అందజేశామని, ఆమె సానుకూలంగా స్పందించారని, ఉన్నతాధికారులకు ఈ విషయాలు తెలియజేస్తామని హామీ ఇచ్చారని అన్నారు. కార్యక్రమంలో దొంతిరెడ్డి రామకృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్ గోరేబాబు, దర్శి విజయశ్రీ, కాటాబత్తుల నిర్మల, వైస్సార్‌సీపీ నాయకులు మేకా అంజిరెడ్డి, కళ్యాణ్, సుబ్బారావు, ఎలీషా తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు ఎంపీ అయోధ్యరామిరెడ్డి పరామర్శ



క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎంపీ అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: వట్టిచెరుకూరులో ట్రాక్టర్ బోల్తాపడి ఏడుగురు మృతి చెందడం ఎంతో బాధాకరమని రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫాతో కలసి మంగళవారం పరామర్శించారు. ఎంపీ మాట్లాడుతూ ఈ ఘటన ఎంతో బాధాకరమన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకు రాగా, అత్యంత మెరుగైన వైద్యాన్ని బాధితులకు అందజేశారన్నారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న క్షతగాత్రుల ఆరోగ్యం నిలకడగానే ఉందని చెప్పారు. మరో రెండు రోజుల్లో వారిని డిశ్చార్జి చేస్తారని, వారికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలకు సంబంధించి పలు మరమ్మతులు ఉన్న నేపథ్యంలో రాజ్యసభ సభ్యులు అయోధ్యరామిరెడ్డి ఎంపీ నిధులతోపాటు, ఇతర నిధులు కలిపి రూ.20 లక్షలు ప్రకటించడం సంతోషదాయకమన్నారు.

బిల్డింగ్‌పై నుంచి పడి కార్మికుడి మృతి

పట్నంబజారు: బిల్డింగ్‌పై నుంచి కిందపడి కార్మికుడు మృతి చెందిన ఘటనపై కేసు నమోదైంది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్వర్ణభారతీనగర్‌కు చెందిన వినుకొండ కృష్ణబాబు(22) సెంట్రింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం వికాస్‌నగర్‌లోని ఓ బిల్డింగ్‌లో పనికి వెళ్లి చెక్కలు తీస్తున్న క్రమంలో ఐదో అంతస్తు నుంచి కిందపడ్డాడు. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి తండ్రి ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మలేరియా మాసోత్సవ ర్యాలీ



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం మలేరియా మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల వైద్యాధికారులు డాక్టర్ ఎం.ఇన్నారావు, డాక్టర్ ఎం. కృష్ణవేణిలు ముఖ్య అతిథులుగా విచ్చేసి ర్యాలీని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ దోమకాటుకు దూరంగా ఉండాలంటే దోమతెరలు వాడాలని, ఖాళీ ప్రదేశాలను శుభ్రంగా ఉంచుకోవాలని, వాడిపడేసిన కొబ్బరి బొండాలు, పాత టైర్లలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని అన్నారు. వాటర్ ట్యాంక్‌లు ఎప్పటికప్పుడు క్లీనింగ్ చేసుకోవాలని, వాటిపై మూతలు ఏర్పాటు చేయాలని, బహిరంగ ప్రదేశాల్లో నీరు నిల్వ ఉంచితే దోమలు వృద్ధి చెందుతాయని, దోమలను నివారించాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి విజయ భాస్కర్, పీహెచ్.ఎన్ వందనాదేవి, సూపర్‌వైజర్ వీరయ్య, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి విస్తరణపై అవగాహన

కార్యక్రమంలో డెప్యూటీ కలెక్టర్ నారాయణశర్మ



మేడికొండూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఎన్‌హెచ్–167 జాతీయ రహదారి విస్తరణ చేపట్టనున్నారు. మండల పరిధిలోని మంగళగిరిపాడు, కొర్రపాడు గ్రామాల పరిధిలోని రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి డెప్యూటీ కలెక్టర్ నారాయణశర్మ హాజరయ్యారు. జాతీయ రహదారి విస్తరణకు అవసరమైన పొలాల సేకరణ, మార్కెట్ విలువకు లోబడి రైతులకు పరిహారం అందించడం జరుగుతోందన్నారు. జాతీయ రహదారి ఏర్పాటు వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అరుణకుమార్, వీఆర్వో జోసఫ్, రైతులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్ క్లీనింగ్

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని పద్మశాలీయుల బజారులో తాగునీరు నల్లగా వస్తోందని సచివాలయంలో మంగళవారం ఫిర్యాదు చేయడంతో వాటర్ వర్క్ సిబ్బంది పైప్‌లైన్ క్లీనింగ్ చేపట్టారు. వాటర్ వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి మాట్లాడుతూ బోరు వాటర్ పైపులైన్‌లోనికి పంపించడం వల్ల పైపులకు డస్ట్ పట్టి నల్లగా వస్తున్నాయని, ముందుగా పైపుల్లోకి బ్లీచింగ్ కలిపిన నీటిని పంపించి, రెండు గంటల పాటు అలాగే ఉంచి క్లీనింగ్ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు.

వరిగడ్డి వామి దగ్ధం

రూ.2లక్షల ఆస్తి నష్టం



మంగళగిరి: నగరంలోని ద్వారకానగర్‌లో సోమవారం అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో 12 ఎకరాల వరిగడ్డి వామి దగ్ధమైంది. అగ్నిమాపక శాఖ అధికారి వెంకటేశ్వరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ద్వారకానగర్‌కు చెందిన కుర్రా బాబు గేదెల మేత కోసం 12 ఎకరాల వరిగడ్డి కొని వామి వేసుకున్నాడు. సోమవారం అర్ధరాత్రి వరిగడ్డి వామికి మంటలు అంటుకున్నాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే వరిగడ్డి పూర్తిగా కాలి బూడిద కాగా సుమారు రూ.2లక్షల ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు బాబు తెలిపాడు.

రాబోయే ఎన్నికల్లో ధైర్యంగా ఓటు అడగవచ్చు

వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు వేమారెడ్డి



డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దొంతిరెడ్డి వేమారెడ్డి

తాడేపల్లిరూరల్: రాబోయే ఎన్నికల్లో ధైర్యంగా ప్రజల వద్దకు వెళ్లి మనం ఓటు అడగవచ్చని, దేశంలో ఏ ప్రభుత్వం పనిచేయని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజారంజక పాలన జరుగుతోందని వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి నగర పాలక సంస్థ పరిధిలోని చిర్రావూరు గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన దగ్గర నుంచి పేద ప్రజల సంక్షేమం కోసమే పనిచేస్తోందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలో అనేక సంక్షేమ పథకాలను చేపట్టామని, దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా పేదలకు ఇళ్ల స్థలాలను కేటాయించి అందులో అక్కచెల్లెమ్మల కోసం ఇంటి నిర్మాణ పనులను చేపట్టామని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేస్తున్న సమయంలో ఇచ్చిన హామీలలో 99 శాతం అమలుచేశారని అన్నారు. మంగళగిరి నియోజకవర్గానికి ప్రత్యేక నిధులు కేటాయించి పలు అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. తొలుత చిర్రావూరు గ్రామంలోని గంగానమ్మ గుడి, శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చిర్రావూరు సెంటర్‌లో ఉన్న దివంగత నేత, ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ చిర్రావూరు కన్వీనర్, ఇప్పటం సొసైటీ అధ్యక్షులు మేకల సాంబశివరావు, ప్రముఖ న్యాయవాది కాశినీడు బాజీగంగాధర్, స్థానిక నాయకులు మొక్కపాటి ఈశ్వరప్రసాద్, కోటా సురేష్, పల్లంపాటి సాంబశివరావు, పోకల రాంబాబు, మేకల నాగేశ్వరరావు, కుర్రా సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

కేఎల్ విశ్వవిద్యాలయానికి 28వ ర్యాంకు

తాడేపల్లిరూరల్ : అత్యుత్తమ ప్రమాణాలు పాటించే విద్యా సంస్థలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో కేఎల్ విశ్వవిద్యాలయానికి 28వ ర్యాంక్ వచ్చినట్లు యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ పార్థసారథి వర్మ తెలిపారు. మంగళవారం వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతదేశంలోని అన్ని ఇంజినీరింగ్ కళాశాలల్లో 44వ ర్యాంక్‌ను, దేశంలోని అన్ని మేనేజ్‌మెంట్ ఇనిస్టిట్యూట్‌లలో 52వ ర్యాంక్‌ను సాధించడంతోపాటు ఓవరాల్ ర్యాంకింగ్‌లో టాప్ 100లో 50వ ర్యాంక్‌ను తమ విశ్వవిద్యాలయం సాధించిందని వివరించారు. భారతదేశంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో 28వ ర్యాంక్ సాధించినందుకు ఎంతో గర్వకారణంగా ఉందని అన్నారు. ఈ గుర్తింపు విద్యాపరమైన నైపుణ్యం, పరిశోధన, ఆవిష్కరణల పట్ల తమ అచంచలమైన నిబద్ధతకు నిలువెత్తు నిదర్శమన్నారు. ఇది తమ విద్యాసంస్థలోని అంకిత భావం కలిగిన అధ్యాపకుల సమష్టి కృషి, ప్రతిభావంతులైన విద్యార్థులు, సహాయక సిబ్బంది కలసి తమ విద్యాసంస్థను ఇంతటి గొప్ప విజయాన్ని తీసుకు వచ్చిందని అన్నారు. కార్యక్రమంలో ప్రొవైస్ చాన్సలర్ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

హిందూ శ్మశానవాటికలో హైమాస్ట్ లైట్ ఏర్పాటు



హిందూ శ్మశానవాటికలో హైమాస్ట్ లైట్లను స్విచ్ఛాన్ చేస్తున్న దామేష్‌రెడ్డి

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని పెనుమాక హిందూ శ్మశాన వాటికలో మంగళవారం కార్పొరేషన్ నిధుల నుంచి హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ పెనుమాక కన్వీనర్ దామేష్‌రెడ్డి మాట్లాడుతూ హిందూ శ్మశానవాటికను దాతలు, కార్పొరేషన్ నిధులతో గతంలో అభివృద్ధి చేశామని, శ్మశాన వాటికలో రాత్రి సమయంలో అసాంఘిక వ్యక్తులు మద్యం సేవించడంతో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) దృష్టికి తీసుకువెళ్లామని వెంటనే స్పందించిన ఆయన కార్పొరేషన్ కమిషనర్ శారదాదేవితో మాట్లాడి రూ.6లక్షల వ్యయంతో ఐమాక్స్ లైట్ ఏర్పాటు చేశారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు భవనం ప్రభాకర్‌రెడ్డి, చిన్ని, మేకా అంజిరెడ్డి, బొక్కా ప్రసన్నకుమార్ (నాని), ఎస్‌కె బషీర్, అన్నూరు సుబ్బారావు, భుజంగరావు, మురళి, మేకా ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలపై దృష్టి సారించిన అధికారులు

- పలుచోట్ల మరమ్మతులు, కొత్తపైపులు ఏర్పాటు
- కొలనుకొండలో ఆరు పబ్లిక్ ట్యాప్‌లు



కొలనుకొండలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న పబ్లిక్ ట్యాప్, నీరు పట్టుకుంటున్న స్థానికులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాగునీటి సమస్యలపై కార్పొరేషన్ అధికారులు దృష్టి సారించారు. వడ్డేశ్వరంలో ఏర్పాటు చేసిన విద్యుత్ బోర్ల నుంచి సరిగా తాగునీరు సరఫరా కాకపోవడంతో వాటికి మరమ్మతులు నిర్వహించి తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. కొలనుకొండలో అన్సర్‌నగర్‌లో పబ్లిక్ ట్యాప్‌లు లేకపోవడంతో స్థానికంగా ఉన్నవారు ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. ఆయన నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి ఆరు పబ్లిక్ ట్యాప్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని 6వ వార్డులో పలు ప్రాంతాల్లోనూ, పద్మశాలీయులబజారులో పాత పైపులైన్లు నుంచి తాగునీరు సరఫరా కాకపోవడంతో కొత్త పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నారు. మహానాడు ప్రాంతంలో రూ.10 లక్షల వ్యయంతో పలుచోట్ల కొత్త పైపులైను పనులు ప్రారంభించారు. 2వ వార్డులో నెమలికంటి సత్యవతి ఇంటి వద్ద నుంచి సాయి ఇంటి వరకు రూ.5 లక్షల వ్యయంతో కొత్త పైపులైను పనులు చేపట్టారు. ఈ పనులన్నీ రెండు రోజుల్లో పూర్తిచేయనున్నట్లు డీఈ కృష్ణారెడ్డి తెలిపారు.

భక్తి శ్రద్ధలతో సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అభిషేకాలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

పాత గుంటూరు: మల్లారెడ్డి నగర్‌లోని శ్రీ విఘ్నేశ్వర, కుమారస్వామి సహిత ధర్మ శాస్త్ర అయ్యప్పస్వామి, విద్యాసరస్వతి, పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో అయ్యప్ప ఫౌండేషన్ చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి, పాలకవర్గం ఆధ్వర్యంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం సుబ్రహ్మణ్యస్వామికి పంచామృతాలు, అనేక సుగంధ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని పర్వతవర్ధిని అమ్మవారికి అభిషేకార్చనలు రుత్వికులు వేదమంత్రాల నడుమ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. నవగ్రహారాధన, నవగ్రహ హోమాలను నిర్వహించారు. సాయంత్రం సుబ్రహ్మణ్య హోమం, శ్రీసూక్త హోమం అనంతరం పర్వతవర్ధిని అమ్మవారికి, సుబ్రహ్మణ్యస్వామికి సహస్ర నామార్చన, విశేష హారతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు అన్నదాన కమిటీ చైర్మన్ గుంటూరు వేమారెడ్డి పాల్గొన్నారు.